# ఉచిత బస్సు

Date : _ / _ / ___

ఉచిత బస్సు పథకం గతంలోని ఎన్నో జ్ఞాపకాలను, అనుభవాలను కూడా మోసుకొస్తుంది.. 60 ఏళ్ళ క్రిందటి ముచ్చట..

చిన్ననాడే తండ్రిని కోల్పోయిన మా పెద్దమ్మను తల్లి ఎంతో గారాబంగా పెంచింది. పెద్దనాన్న ఏమి సంపాదించేవాడు కాదు. ఇతరుల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ పరోపకారిగా కీర్తిని పొందాడు.

పెద్దమ్మకు తల్లి ప్రేమగా ఇచ్చిన డబ్బులతో సంసారం గడిచేది.
అతి కష్టంగా మిగుల్చుకున్న వాటితో వూరి ప్రయాణ ఖర్చులకు ఉపయోగించుకునేది.

ఆరోజుల్లో కాలి బాట లేదా ఎడ్ల బండిలో ప్రయాణించేవారు.
బస్సులు వచ్చాక, పల్లెలకు ఎంతో దూరంగా వున్న పెద్దరోడ్డు వరకు వెళ్ళి బస్సును అందుకునే వారు. రోజులో ఎప్పుడో కాని బస్సు వచ్చేది కాదు.
రోడ్డు ప్రక్కన (చెట్లలో) వేచి వుండేవారు.

ఆనాటి సామాన్య ప్రజల్లో కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన వుండేది కాదు. పాపకార్యంగా కూడా భావించేవారు. కొందరికి సంతానం పదికి దాటేవాళ్ళు కూడా.. కడుపు నిండా కన్న తల్లిని చూచి గర్వపడే వాళ్ళు. బస్సు సౌకర్యాలు లేక, సరియైన సమయానికి ఆసుపత్రి చేరుకోలేక ఎందరో ప్రసవ కాన్పుల్లో మరణించేవారు.

మా పెద్దమ్మకు ఒక కూతురు తర్వాత పిల్లలు కలగలేదు. తల్లి తనను పెంచినట్టే తన బిడ్డను కూడా గారాబం చేస్తూ ఏడు ఏళ్ళు నిండినా చనుపాలు ఇచ్చేదట......

ప్రయాణంలో వారికి ఒక బిస్తరు, సందుక, చేతిలో మంచినీటి మరచెంబు చంకలో బిడ్డ... మిగతా పిల్లలు తల్లిని చుట్టుకుని సాగేవాళ్ళు.
భర్త ముందు హుందాగా నడుస్తూ.. మహా అయితే ఒకరిని వేలుపట్టి నడిచేవాడే మొనట..

ఒకసారి పెద్దమ్మ ఒంటరిగా ప్రయాణించ వలసి వచ్చింది.
తలపై బిస్తరు, సందుక, కుడి చేతిలో మరచెంబు, ఎడమ చంకలో కూతురు.
పెద్దమ్మ అతి ప్రయాసగా బస్సులో చేరబడిందట.
పెద్దలకు ఫుల్ టికెటు, ఎడపిల్లలకు హాఫ్ టికెటు, చంకలో పాలుత్రాగే పసివారికి టికెట్ వుండేది కాదు (మాఫ్ అన్నమాట)

కండక్టరు ఇద్దరికి డబ్బులు అడిగాడట.
పెద్దమ్మ తన కూతురుని గుండెలకు దగ్గరగా చేర్చుకుని ముఖం నిండా కొంగు కప్పి, "మా పాప ఇంకా పాలు మరవనే లేదు. దీని తర్వాత పిల్లలే కలగలేదు టికెట్ ఎలా తీసుకుంటావు? అంటూ వాదనకు దిగిందట.
"అమ్మా! నీ పాప వయస్సు తెలుస్తుంది. పాప కాళ్ళు నీ మోకాళ్ళు దాటుతున్నాయి! మూడు ఏళ్ళ వరకే టికెట్ వుండదు తల్లీ!"
"లేదు! లేదు.. నా బిడ్డ ఇప్పటి వరకు ఎడపిల్ల కాలేదు (ఒకవైపు కళ్ళు తుడుచుకుంటూ ముక్కు చీదుతూ) ఈ బిడ్డ తర్వాత మరుజూల పిల్లలు లేకుండా టిక్కెట్ ఎలా తీసుకుంటావు! నీకు న్యాయం వుందా! అంటూ వాదన పెంచిందట

అంతకైతే నేనిలా నుంచునే వుంటాను. నీ సీటు నాకు వద్దులే!" అలుగుతుంది. "అమ్మా! ఎంతసేపని నిలుచుంటారు? అమ్మాయి చంక దిగితే టికెట్ తీసుకోవాల్సి వస్తుంది.. చెకింగ్ మాస్టర్ వస్తే నా ఉద్యోగం పోతుంది" ఆవేదనగా కండక్టర్. పెద్దమ్మ టికెట్ ససేమిరా తీసుకోనేదు. బస్సులో వున్నవారంతా తమాషాగా చూస్తున్నారట. కొంగు చాటున ఊపిరాడక పాప (అమ్మాయి) ఏడుపు లంకించుకుంది. ఒకరు పాపకు అరటిపండు అందిస్తారు. అరటిని నోట కడుపు చల్లగుండా అంటూనే కొంగు చాటునే తినిపిస్తూ పాప తల మొట్టిందట. పాప తీగరాగం మొదలెట్టింది.

ఇదంతా చూడలేక ఒకాయన "నేను తీసుకుంటాలే సగం టికెటే కదా! నేను తీసుకుంటానులే" అంటాడు. 'నా బిడ్డకు నీవెవరు తీసుకోడానికి' ఆయనతో తగవు పడిందట. అభిమానవతి. మరొకరి దగ్గర తీసుకోదు.

నిజానికి కూడా ఆమె దగ్గర డబ్బులు లేవు. ఒకటి టికెట్టుకు సరిపోనే వున్నాయి. ఆమెకు తెలిసిందొక్కటే. చంకలో బిడ్డవుంటే టికెట్టు వుండదని, బిడ్డ తర్వాత బిడ్డ పుట్టేవరకు ఈ బిడ్డ తొలిచూలు బిడ్డేనని.....

ఆమె పరిస్థితి గ్రహించిన ఆ బస్సులోని నలుగురూ నాలుగు పైసలు వేసుకొని ఆమెకు తెలియకుండా టికెట్టు తీసుకున్నారట.

స్టేజి రాగానే ఆమె సామాన్లు దింపి కండక్టర్ సహాయం చేశాడట.

పెద్దమ్మను తీసుకుపోవడానికి తల్లి పంపిన బండివాడితో "చూశావురా? కండక్టర్ ఏమి చేశాడో... అంటూ జరిగిందంతా చెప్తుండగా. ఇంకా ఇప్పటివరకు కదలని బస్సులోని వారంతా నవ్వుకున్నారట. పెద్దమ్మ అమాయకత్వానికి...

ఎన్నోనాళ్ళు మా వాళ్ళంతా చమత్కారంగా ఈ విషయం ముచ్చటించుకుంటూ నవ్వుకునే వారు. కూతురు పెళ్ళీడు కొచ్చినా ఇంకొకరు పుట్టేవరకు టికెట్ తీసుకోదేమో అంటూ జోక్ చేసేవారు.

మా పెద్దమ్మ... అమాయకపు పెద్దమ్మ.

ఇప్పుడు "ఉచిత బస్సు" చూసి వుంటే
ఎంత సంతోషించేదో... మురిసిపోయేదో....
ఎన్నిసార్లు అమ్మవద్దకు ప్రయాణించి
మమతలు పంచుకునేదో...

యన్, నిర్మలాదేవి.

N. Nirmala Devi. HNo 2-7-188.
Excise colony. Subedari.
HANAMKONDA. Dist
Warangal.